తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-09-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 104 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది



## ఉస్మాన్ సాగర్ వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన

## నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఈ పథకం తీసుకువచ్చామన్న ముఖ్యమంత్రి

## సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకు వెళతామని వ్యాఖ్య

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మహానగరాన్ని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో..





# మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయండి

- మేడారం, బాసర ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- మేడారం అభివృద్ధికి సంబంధించి డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి
- ప్రపంచంలో అతిపెద్ద గిరిజన పండుగ మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మేడారం అభివృద్ధికి సంబంధించిన పనులు వంద రోజుల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

మిగతా 2లో..

# అంగన్వాడీలకు ఫుడ్ గ్యాప్ ఉండోద్దు

- సకాలంలో సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలి
- గుడ్ల సరఫరాలో లోపాలు జరిగితే కఠిన చర్యలు
- మహిళల భద్రతపై త్వరలో సదస్సు
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క

2లో



## బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని

# నిలదీసిన కవిత

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు.

మిగతా 2లో..



# తండ్రిని చంపిన కసాయి కొడుకు

- కల్వకుర్తిలో వృద్ధుడి మర్మమైన గాయబాటు
- స్కూటీ పక్కన రక్తపు మరకలు – అనుమానాలు రేకెత్తింపు
- సీసీ కెమెరాల్లో బయటపడిన హత్యా దృశ్యాలు
- కర్రతో దాడి చేసి తండ్రి ప్రాణం తీసిన కుమారుడు
- మృతదేహాన్ని దాచేందుకు మేనల్లుడు సహకారం

2లో

# అబద్ధాల అంబాసిడర్‌గా కేటీఆర్

- మైదం మహేష్ జీతం ఆలస్యానికి ప్రభుత్వానికి సంబంధం లేదు
- జీతం ప్రాసెస్‌లో నిర్లక్ష్యం చేసిన ఇద్దరు సిబ్బందిని ఇప్పటికే విధుల నుండి తొలగించాం
- మంత్రి సీతక్క





హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ములుగులో మల్టి పర్పస్ వర్కర్ మైదం మహేష్ మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కేటీఆర్ గారు వాడుకోవడం సిగ్గుచేటు.టీఆర్ఎస్ హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు రాక సమ్మెలు చేసిన రోజులు ప్రజలు మరిచిపోలేదు. సిరిసిల్ల నుంచి సిద్దిపేట దాకా కలెక్టరేట్ల ఎదుట సఫాయి అన్నలు నిరసనలు చేస్తే పట్టించుకోని మీరు, నేడు మోసలి కన్నీరు కారిస్తే కార్మికులు నమ్మే పరిస్థితి లేదు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న వేలాది పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల్లాగే ప్రతి నెల జీతాలు చెల్లిస్తున్నాము. ఇందుకోసం గ్రీన్ ఛానెల్ విధానాన్ని ప్రవేశపెట్టి, జీతాలు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకున్నాము. మీ హయంలో ఎప్పుడు జీతం వస్తుందో తెలియక ఇబ్బంది పడిన 50 వేల మందికి పైగా ఎం.పీ.డబ్ల్యూ కార్మికులకు ఇప్పుడు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు అందుతున్నాయి. ములుగులో మైదం మహేష్ జీతం ఆలస్యం కావడంలో ప్రభుత్వ తప్పిదం లేదు. జీతం ప్రాసెస్ చేసే సమయంలో స్థానిక పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వలన రెండు నెలల వేతనం ఆలస్యమైంది.

మిగతా 7లో..

# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడం లేదు

- రైతుల పక్షాన తమ గళాన్ని వినిపిస్తామన్న కేటీఆర్
- అందుకే రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటన
- రైతుల సమస్యలపై బీజేపీ, కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయమని వెల్లడి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఉపరాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయించుకున్నట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రైతుల పక్షాన తమ గళాన్ని వినిపించేందుకే ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండూ రైతాంగాన్ని వేధిస్తున్నాయని ఆరోపించారు.



మిగతా 7లో..



# తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్

- వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో స్థిరమైన వృద్ధి
- కర్ణాటక, హర్యానాలను అధిగమించి తెలంగాణ రాష్ట్రం రికార్డు సాధించింది
- మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో స్థిరమైన వృద్ధితో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచిందని నొక్కిచెప్పారు. కర్ణాటక, హర్యానాలను అధిగమించి తెలంగాణ రాష్ట్రం రికార్డు సాధించిందని పేర్కొన్నారు.

మిగతా 2లో..

# తెలంగాణ బీజేపీకి షాకిచ్చిన సుప్రీంకోర్టు

- సుప్రీంకోర్టులో తెలంగాణ బీజేపీకి ఎదురుదెబ్బ
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా
- రాజకీయాలకు కోర్టులను వేదికగా చేసుకోవద్దు – సుప్రీంకోర్టు
- రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలి
- బీజేపీపై పది లక్షల జరిమానా హెచ్చరిక
- హైకోర్టులోనూ విఫలమైన బీజేపీ పిటిషన్
- మరోసారి చుక్కెదురైన రాష్ట్ర బీజేపీ

7లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది

(మొదటి పేజీ తరువాయి)

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్వాసితులు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. గోదావరి తాగునీటి సరఫరా పథకం, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నింపడం ద్వారా మూసీ నది పునరుజ్జీవం పథకానికి గండిపేట వద్ద ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దాదాపు 7,360 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం గోదావరి నది నుంచి 20 టీఎంసీ నీటిని తరలించడం ప్రధానం కాగా, అందులో జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 17.50 టీఎంసీల నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను నింపడం, మరో 2.50 టీఎంసీల జలాలను మూసీ నది పునరుజ్జీవనానికి కేటాయించడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "గోదావరి జలాలను తరలించే ఈ గొప్ప కార్యక్రమం ద్వారా జంట నగరాల తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మూసీ కాలుష్యాన్ని నివారించి నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కల్పిస్తాం.

నగరానికి ప్రతి ఏటా 3 శాతం ప్రజలు వలసలు పెరుగుతున్నాయి. నగరం కోటిన్నర జనాభాకు పెరుగుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా భవిష్యత్తు ప్రణాళికలు అవసరం. పెరుగుతున్న నగర అవసరాల మేరకు కృష్ణా జలాలు కూడా సరిపోవని అనుకున్నప్పుడు గోదావరి జలాలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేళ్లలో కృష్ణా, గోదావరి నదుల నుంచి చుక్క నీరు కూడా హైదరాబాద్ నగరానికి తరలించలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ గోదావరి నీటిని తరలించి కేవలం హైదరాబాద్ ప్రజలకు తాగునీరే కాకుండా కాలుష్యం నుంచి మూసీ నదిని ప్రక్షాళన చేసే కార్యక్రమం చేపట్టాం. మురికికూపంగా మారి విషం చిమ్ముతున్న మూసీ జలాల వల్ల ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో నీరు తాగితే పశువులే కాదు, మనుషులు ప్రాణాలు పోతున్నాయి. పుట్టబోయే బిడ్డలు సైతం అంగవైకల్యంతో పుడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలో సబర్మతీ, ఉత్తర ప్రదేశ్‌లో గంగా, ఢిల్లీలో యమునా నదుల ప్రక్షాళన చేసుకున్నప్పుడు 4 కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగొద్దు.

ఆ జిల్లా ప్రజలతో కలిసి నడిచినప్పుడు ఎలాగైనా సరే మూసీని పునరుజ్జీవింపజేయాలని ప్రజలు కోరినప్పుడు ఆరోజు మాటిచ్చా. మూసీని ప్రక్షాళన చేస్తాం. హైదరాబాద్ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్ ఫ్యాక్టరీల కాలుష్యం మూసీలో కలవకుండా నియంత్రిస్తాం. హైదరాబాద్ నగరానికి గోదావరి జలాలను తరలించాలన్న ప్రాజెక్టుకు మూలం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. గోదావరిపై 2008 లో తుమ్మడిహెట్టి వద్ద దివంగత వైఎస్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతిని ప్రారంభించారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో త్వరలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి గారితో చర్చలు జరుపుతాం. తుమ్మడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టాలని ప్రతిపాదిస్తే, మహారాష్ట్ర ప్రభుత్వం 142 మీటర్ల ఎత్తు వరకు అభ్యంతరం చెప్పడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మధ్యంతరంగా 148, 150 మీటర్ల వరకైనా ఒప్పించి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షన్నర, రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గతంలో సంకల్పించినట్టుగా ప్రాజెక్టును పూర్తి చేసి చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి వరకు వ్యవసాయానికి గోదావరి జలాలను తరలించడం ద్వారా ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటాం. ఈ ప్రాజెక్టు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం. బుద్వేల్ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన హబ్‌గా అభివృద్ధి చేస్తాం. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రాజెక్టు కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వం తలపెట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో కలిసి రండి.." అని పిలుపునిచ్చారు.

# మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మేడారం, బాసర ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు వివరించగా, మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మేడారం అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి వంద రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద గిరిజన పండుగకు సంబంధించి నిర్మాణాలు పూర్తిగా సహజ సిద్ధమైన రాతి కట్టడాలతో చారిత్రాత్మకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు అన్నీ సక్రమంగా ఉండాలని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా ప్రాంతాల వారిగా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో మేడారంకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని చెప్పారు. దీనితో పాటు బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అన్ని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించడంతోపాటు, స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలకు ఫుడ్ గ్యాప్ ఉండొద్దు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సోమవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు. శాఖలో జరుగుతున్న పనుల పురోగతిపై, అమలవుతున్న పథకాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గుడ్లు, పాలు, పప్పు, మంచినూనె, స్నాక్స్, బాలమృతం సరఫరాపై సమీక్ష జరిపారు. అధికారుల నివేదిక ప్రకారం పాలు మినహా మిగిలిన వస్తువులన్నీ 98 శాతం పైగా సరఫరా అవుతుండగా, పాలు మాత్రం గత నెలలో 58 శాతం మాత్రమే సరఫరా అయ్యాయని తెలిపారు. పాల సరఫరా లోపంపై మంత్రి సీరియస్‌గా స్పందించి, పాలతో సహా ఎక్కడా ఫుడ్ గ్యాప్ లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. గుడ్ల సరఫరా విషయంలో మంత్రి సీతక్క అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. 5 జిల్లాలు మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు టెండర్లు ఖరారు చేసినట్లు అధికారులు తెలియజేశారు. గుడ్ల సరఫరాలో కలర్ కోడిరగ్ తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేస్తూ, ప్రతి పది రోజులకు ఒకసారి ఏజెన్సీలు గుడ్లు సరఫరా చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో కాంట్రాక్టులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీం ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. 1261 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి లక్ష్యాన్ని నిర్ణయించగా, 1181 కేంద్రాలకు స్థలాలు గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి లోపు భవనాల నిర్మాణం పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే నిర్మాణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో బల్లలు, సిబ్బంది యూనిఫాంలు, చిన్నారుల యూనిఫాంలు తక్షణం సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళల భద్రత అంశంపై కూడా మంత్రి దృష్టి సారించారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగినులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో మహిళా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, మహిళల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. ఈ నెల 19,20 తేదిల్లో మహిళా భద్రత పై చర్చించేందుకు రౌండ్ టెబుల్, మహిళా సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారి చేశారు.



# తండ్రిని చంపిన కసాయి కొడుకు

(మొదటి పేజీ తరువాయి)

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వాసవినగర్ లో వృద్ధుడు చాగొండ బాలయ్య నివాసం ఉంటున్నాడు. బాలయ్యకు ముగ్గురు కుమారులు. ఇందులో ఒకరు గతంలోనే మరణించాడు. మిగిలిన ఇద్దరి కుమారులకు పెళ్లిలు అయ్యాయి. ఎవరి సంసారాన్ని వారు విడిగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక బాలయ్య స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే రోజు మాదిరిగానే ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం గం.3.00లకు తన పొలం వద్దకు వెళ్లాడు. అయితే రాత్రైన బాలయ్య ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పెద్ద కుమారుడు మల్లయ్యకు సమాచారం ఇచ్చింది. దీంతో మల్లయ్య పొలం వద్దకు వెళ్లి చూడగా తండ్రి బాలయ్య స్కూటీ పక్కనే ఉన్న చిన్న కుమారుడు బీరయ్య పొలం షెడ్డు వద్ద కనిపించింది. అయితే గడచిన కొన్ని నెలలుగా తండ్రి బాలయ్య, కుమారుడు బీరయ్య మధ్య గొడవలు నడుస్తున్నాయి. ఇరువురు మాట్లాడుకోవడం లేదు. ఈ క్రమంలో బాలయ్య ద్విచక్ర వాహనం అక్కడ ఉండడం అనుమానాలను రేకెత్తించింది. వెంటనే షెడ్డు వద్దకు వెళ్లి చూడగా అక్కడక్కడ రక్తపు మరకలు కనిపించాయి. చుట్టూ పక్కల మొత్తం వెతికిన ఎక్కడ ఎవరు కనిపించలేదు.




ఇక ఈ మొత్తం వ్యవహారంపై మరునాడు ఉదయం కల్వకుర్తి పోలీసులకు పెద్ద కుమారుడు మల్లయ్య ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు చిన్న కుమారుడి పొలం వద్ద ఉన్న షెడ్డు, రక్తపు మరకలను గమనించి అక్కడే ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. తండ్రి బాలయ్యపై కుమారుడు బీరయ్య కర్రతో విచక్షణ రహితంగా దాడి చేసి చంపిన దృశ్యాలను చూసారు. దీంతో బాలయ్యను కుమారుడే హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే తండ్రి బాలయ్యను కొట్టి చంపిన తర్వాత వరుసకు మేనల్లుడు అయ్యే వోరే అంజిని కారు తీసుకునిరమ్మని చెప్పాడు బీరయ్య. ఈ మొత్తం వ్యవహారాన్ని బాలయ్య జీతగాడు రామచంద్రి చూసాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బీరయ్య బెదిరించడంతో అక్కడి నుంచి రామచంద్రి పారిపోయాడు. ఇక అంజి కారు తీసుకొని రాగానే డెడ్ బాడీని డిక్కిలో వేసుకొని చింతపల్లి డీఎల్ఐ కాల్వ వద్దకు వెళ్లారు. చీకటి పడే వరకు అక్కడే ఉండి.. చెట్ల పొదల్లో అక్సల్ బ్లేడ్ సహాయంతో తండ్రి బాలయ్య తల, మొండం వేరు చేశారు. అనంతరం తండ్రి చెవులకు ఉన్న నాలుగు బంగారు పోగులను తీసుకున్నారు. తర్వాత డీఎల్ఐ కాలువలో తలను, డిరడి చింతపల్లి వాగులో మొండంను పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులను గుర్తించిన పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టారు. నమ్మదగిన సమాచారంతో కల్వకుర్తి పట్టణ సమీపంలో ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. అనంతరం నిందితుల సమాచారం మేరకు డెడ్ బాడీ భాగాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించారు. అయితే బీరయ్య కుమార్తె మూడు నెలల క్రితం అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. తండ్రి బాలయ్య చేతబడి చేయించి తన కుమార్తెను చంపించాడని బీరయ్య అనుమానం పెట్టుకున్నాడు. దీనికి తోడు బీరయ్య తల్లిపై ఉన్న భూమి అంశంలోనూ తండ్రీ, కొడుకుల మధ్య తగాదాలున్నాయి. ఈ రెండు కారణాలచేతనే తండ్రి బాలయ్యను కుమారుడు బీరయ్య చంపాడని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి తెలిపారు.

## బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని
# నిలదీసిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.



# తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. వార్షిక రుణ ప్రణాళికలో మొదటి క్వార్టర్‌లోనే 33.64శాతం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు, స్వయం ఉపాధి పథకాలకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా భావిస్తోందని చెప్పుకొచ్చారు మల్లు భట్టి విక్రమార్క. రైతుల పక్షాన రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట రూ.30 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని.. బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇది ఒక రికార్డు అని ఉద్ఘాటించారు.



రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలని సూచించారు. ఆస్తుల తాకట్టు, ఫిక్సడ్ డిపాజిట్లు చేయాలని మార్గ నిర్దేశం చేశారు. బ్యాంకుల అధికారులు రైతులను ఒత్తిడి చేయొద్దని కోరారు. రైతుల విషయంలో బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని మల్లు భట్టి విక్రమార్క సూచించారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- **పెద్దమండడిలో గురుపూజోత్సవ వేడుకలు**

**పెద్దమందడి,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** గురుపూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి శ్రీమతి మంజులత మాట్లాడుతూ – "విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర విశేషమైంది. సమాజానికి మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయుల త్యాగం మరువలేనిది" అని అన్నారు.

కాంప్లెక్స్ ప్రధానో ఉపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు, శాంతన్న, ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

వివిధ సంఘాల నాయకులు అనిల్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, నిరంజన్ గౌడ్, శశివర్ధన్, లక్ష్మణ్, దర్గయ్య తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను అభినందించారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు విశేషంగా పాల్గొని సన్మానోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.






## పాఠశాల విద్యార్థులకు పొంగులేటి రాఘవ ట్రస్ట్ ద్వారా షూ సాక్స్ అందించారు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు:** పాలేరు శాసనసభ్యులు మరియు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాఘవ ట్రస్ట్" ద్వారా ఎంపీపీఎస్ లింగారం తండా ప్రాథమిక పాఠశాల కు బహుకరించిన షూస్ మరియు సాక్స్ లను విద్యా ర్థులకు అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బానోత్ నాగేశ్వర రావు, గ్రామ నాయకులు బానోత్ రవి, వడిత్య కిషన్, వడిత్య బాలాజీ ఉపాధ్యాయులు నల్లమల ప్రభాకర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 08(తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ వర్గీకరణలో మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి సిద్ధమైన మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్టు అయిన వారిలో మాల మహానాడు నాయకులు పిల్లి మల్లిఖార్జునరావు, కోపల్లి రత్తయ్య, కరిపెడ సుదర్శన్ తదితరులు ఉన్నారు.






## నాగారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### విద్యార్థుల కోసం కొత్త కార్యక్రమాలు, గురువుల సేవలను కొనియాడిన అతిథులు

**నాగారం, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయుల త్యాగాన్ని, విద్యపై వారి నిబద్ధతను గౌరవిస్తూ నాగారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించగా, సెలవు రోజు కారణంగా సోమవారం తేదీకి మార్చినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపన్యాసాలు అందించి గురువుల సేవల గురించి, విద్య ప్రాధాన్యత గురించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు.అడ్వకేట్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "మేము కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు ఉన్నత స్థాయికి చేరుకున్నాం. విద్య వల్లనే మా జీవితంలో మార్పు వచ్చింది. మేము చదివిన పాఠశాలకు తిరిగి ఏదైనా సేవ చేయాలని భావించి 'ఛాలెంజ్ ట్రోఫీ'ను ప్రారంభించాం. గత సంవత్సరం కీసర పాఠశాల ఈ ట్రోఫీని గెలుచుకుంది. ఈ సంవత్సరం నాగారం పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. వచ్చే ఏడాది కూడా ఇదే విజయాన్ని కొనసాగించాలని ఆశిస్తున్నాం" అని చెప్పారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రారెడ్డి మాట్లాడుతూ, "చిన్న వయసులోనే చదువు యొక్క విలువను గ్రహించి, విద్యను అభ్యసిస్తే జీవితానికి మంచి దారి దొరుకుతుంది. పెద్దయ్యాక విద్య యొక్క ప్రాముఖ్యత తెలిసినా, సమయం లేకపోవడం వల్ల చదువు కొనసాగించలేకపోతాం. ఉపాధ్యాయులను గౌరవంగా చూసి, వారి మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు. కీసర సి.ఐ. ఆంజనేయులు విద్యార్థులను ఉద్దేశించి, "డ్రగ్స్, ఫోన్ వ్యసనాలకు లోనవ్వద్దు. మీ లక్ష్యాలను గుర్తించి, చదువుపై దృష్టి పెట్టండి.సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తి విద్యార్థులలోనే ఉంది" అని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోసం ఆరు నెలల్లో కొత్త షూస్‌ను అందిస్తానని హామీ ఇవ్వడం విద్యార్థులలో ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు రవీందర్, శ్రీనివాస్ గౌడ్, బోడ శ్రీనివాస్, జ్యోతి, ఎస్.ఐ., అలాగే పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, రఘు, శ్రీదేవి, సుమతి, సంధ్యా రాణి బి., సంధ్యా రాణి, అజీజ్ అహ్మద్, మలోత్ నాయక్, వందన, పద్మ, వరమ్మ, సత్యశ్రీ, సరిత, సంజయ్ రాణి, అర్చన, సుప్రజ, పాండురంగారెడ్డి, గాయత్రీ, అర్చన పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, క్లర్క్ జాయ్ మెర్సీ, వాలంటీర్లు ఆల్కా, శ్రీవిద్య, పావని, పవిత్ర, అటెండర్ లక్ష్మీ, సంధ్యలు కూడా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వామ్యమయ్యారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడం, ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావం, సమాజం ముందుకు సాగేందుకు విద్య యొక్క ప్రాముఖ్యతపై సాగిన చర్చలు ఈ కార్యక్రమాన్ని మరింత అర్థవంతంగా మార్చాయి.



## నిబద్ధతగల కమ్యూనిస్టు అవులూరి బక్కిరెడ్డి

- **సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** పార్టీ ఇచ్చిన పిలుపు తూచా తప్పకుండా అమలు చేసే అవులూరి బక్కిరెడ్డి నిబ్బద్ధత గల కమ్యునిస్టు అని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు అవులూరి బక్కిరెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా బక్కిరెడ్డి స్మాకరక స్థూపంకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ కోమట్లగూడెం అభివృద్ధిలో బక్కిరెడ్డి పాత్ర ఎనలేనిదన్నారు. నిత్యం ప్రజాసమస్యలే ఎజెండాగా పనిచేసేవాడన్నారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారిని వెంటబెట్టుకుని నాయకుల వద్దకు తీసుకువచ్చి వారి సమస్యలు పరిష్కరించేవాడన్నారు. బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు. ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి బక్కిరెడ్డి పాత్ర ఎనలేనిదన్నారు. మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్ళేవాడన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా, మండల కార్యవర్గ సభ్యులుగా పార్టీ ఎదుగుదలకు చేసిన కృషి మరువలేనిదన్నారు. బక్కిరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దొబ్బల వెంగళరావు, పదిమల వెంకట నర్సయ్య, జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్ రావు, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వేముల జానకిరాములు, నాగిలిగొండ, కోమట్లగూడెం, నేరడ శాఖ కార్యదర్శులు చాట్ల రమేష్, రామిరెడ్డి, షేక్ దస్తగిరి నాయకులు వేమిరెడ్డి సీతారామిరెడ్డి, కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## రహదారులు, డ్రైనేజీ మరమ్మత్తులు వెంటనే చేయాలని ప్రజల డిమాండ్

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజ్గిరి పరిధిలోని ప్రజలు వర్షాలు మొదలైన తర్వాత తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దీని దయాల్ నగర్, టెలికాం కాలనీ, రేణుక నగర్, మధురానగర్, కాకతీయ నగర్, నేరెడ్మెట్, గౌతమ్ నగర్ వంటి ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తరచుగా కిందపడుతూ గాయపడుతున్నారు. చేతులు, కాళ్లు విరగడం వంటి ఘటనలు చోటు చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు.

ఇంకా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రహదారుల మీదకు చేరి, కొన్ని చోట్ల ఇండ్లలోకి కూడా ప్రవేశించింది. దీనివల్ల నిత్యవసర వస్తువులు, విద్యుత్ ఉపకరణాలు, ఇంటి సామాగ్రి పాడైపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. నీటి నిల్వల వల్ల ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంది. కాలువల్లో మురికి పేరుకుపోయి ఉండటంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు జిహెచ్ఎంసి ఉప కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రజల ప్రాణాలకు, ప్రయాణానికి భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, రహదారులు మరమ్మత్తు చేయాలని, డ్రైనేజీలు శుభ్రం చేయాలని, నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, వీధి దీపాలను సరి చేయాలని వారు డిమాండ్ చేశారు.సిపిఐ నాయకులు మాట్లాడుతూ, "ప్రజలు నరకప్రాయంగా జీవిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే, ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు త్వరితగతిన సమస్య పరిష్కారం కావాలని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## భాజపా రాష్ట్ర కోశాధికారిగా దేవకి వాసుదేవరావు

**అభినందించిన జిల్లా అధ్యక్షులు నెల్లూరు.**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 08, తెలంగాణ ముచ్చట్లు:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన కమిటీలో ఖమ్మం జిల్లా నాయకుడు దేవకి వాసుదేవరావుకి కీలక బాధ్యతలు లభించాయి. తాజాగా ప్రకటించిన జాబితాలో ఆయనను రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ జాబితాలో ఖమ్మం జిల్లా నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, దేవకి వాసుదేవరావును హృదయపూర్వకంగా అభినందించారు.

ఖమ్మం జిల్లా నాయకుడిగా దేవకి వాసుదేవరావు రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టడం పార్టీ బలపడేందుకు తోడ్పడుతుందని భాజపా శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అమరజీవి సత్తైనపల్లి రామకృష్ణ 25వ వర్ధంతి

## పోరాట స్ఫూర్తిని స్మరించుకున్న సిపిఎం

**సత్తుపల్లి, సెప్టెంబర్ 08(తెలంగాణ ముచ్చట్లు):** సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ 25వ వర్ధంతి కార్యక్రమం పాత సెంటర్‌లో జరిగింది. ఈ సభకు పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వర రావు అధ్యక్షత వహించారు.

భలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు, పార్టీ నాయకులు రావుల రాజబాబు తదితరులు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ, విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బషీర్బాగ్ వద్ద కమ్యూనిస్టులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు కాల్పులు జరపగా సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. వారి త్యాగం వృథా కాలేదని, ఆ పోరాటం ఫలితంగానే ఈరోజు రైతులకు మరియు బడుగు బలహీన వర్గాలకు ఉచిత విద్యుత్తు అందుతోందని స్పష్టం చేశారు.

ప్రజల కష్టార్జిత ధనంతో నిర్మించిన ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. విద్యుత్, బొగ్గు, గ్యాస్ వనరులను పెద్ద పెట్టుబడిదారులకు అప్పగించేందుకు చట్టాల్లో మార్పులు చేస్తున్న కేంద్రాన్ని వారు తప్పుబట్టారు.

ఆనాటి ఉద్యమ స్ఫూర్తితో కొత్తగా పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉందని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సైదా, వలి, భాస్కర్, రాము, నల్లగట్ల వెంకటేశ్వరరావు, జిలాని రామకృష్ణ, శివ, శ్రీనివాసరావు, బడే మియా, నభి, మీరాజ్, శివ ప్రసాద్, మారేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ

## మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 9న ఘనంగా నిర్వహించుకోనున్న సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ అని, ఆయన కవిత్వం కేవలం సాహిత్యమే కాకుండా సామాజిక మార్పుకు మార్గం చూపిన శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. పేదల వేదన, ప్రజల ఆశలు, సామాజిక అన్యాయాలను ప్రతిబింబించేలా ఆయన రచనలు నేటికీ తరతరాలకు ప్రేరణ నిస్తున్నాయని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజాకవి కాళోజీ అని నామ అన్నారు. సాదాసీదా జీవనం గడిపి, తన ఆలోచనలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడని ఆయన పేర్కొన్నారు. నాడు తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ పాలనలో కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడం గర్వకారణమని నామ తెలిపారు. కాళోజీ కలలు, ఆకాంక్షలు సాకారం చేసే దిశగా మనమందరం ముందుకు సాగాలని కోరారు.

# రోకటి సురేష్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** జూలూరుపాడు మండలం, పాపకొల్లు గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీ రోకటి సురేష్ మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. వారి మరణం గ్రామానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటు అని నామ పేర్కొన్నారు. రోకటి సురేష్ కుటుంబ సభ్యులుకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు.





# రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చినా బియ్యం రాక నిరాశలో లబ్ధిదారులు!

## సీపీఎం ఆందోళన

**వేంసూరు, సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** రేషన్ కార్డుల్లో కొత్తగా భార్య, పిల్లల పేర్లు చేర్చినా మూడు నెలలుగా బియ్యం అందకపోవడం పేద కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం మండల కమిటీ మండిపడింది. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదైనప్పటికీ రేషన్ దుకాణాల్లో డీలర్లు మాకు బియ్యం అలాట్మెంట్ రాలేదని చెబుతూ లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం తీవ్ర అన్యాయమని మండల కమిటీ సభ్యుడు మల్లూరు చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వేంసూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మాణిక్ రావుకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన జిల్లా అధికారులకు వెంటనే సమాచారం పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు, నాయకులు డంకర శ్రీను, సాధు శరత్ బాబు, బూరుగు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగుల పెన్షన్ కోసం ధర్నా

## జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులతో కలిసి ధర్నా




**మేడ్చల్ మల్కాజిగిరి, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల కోసం జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ ఉద్యమంలో భాగంగా, పెంచిన పెన్షన్‌లను వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు రూ.4,000 నుండి రూ.6,000 వరకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ మరియు చేనేత కార్మికులకు రూ.2,000 నుండి రూ.4,000 వరకు పెన్షన్‌లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినప్పటికీ, లక్షలాది మంది దరఖాస్తుదారులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లు మంజూరు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

అదే సమయంలో, వికలాంగులకు 5% జి.ఓ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, వికలాంగులకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు రిజర్వేషన్లు కల్పించాలని, మొత్తం 25 డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ధర్నాను ప్రారంభించే ముందు ఎం.ఆర్.పి.ఎస్ మరియు జలమండలి నాయకులు ఎన్.వై.అశోక్, బచ్చలికూర స్వామి, సురేష్ పాటలతో కార్యక్రమానికి ఉత్సాహం నింపారు. అనంతరం జిల్లా అధికారి ఏ.ఓ. రామ్మోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షుడు కేశపాగ రామచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు పంగ., టీ.డి.పి సీనియర్ నాయకుడు బత్తిని నర్సింహ గౌడ్, ప్రనేయ్ మాదిగ, పరమేష్, పరశురాం, శివకుమార్, బలనరసింహ, రామకృష్ణ, అంజి, శేఖర్, కృష్ణ, రసమల, యాదగిరి మరియు వి.హెచ్.పి.ఎస్ నాయకులు నర్సింహ, వై.రాము, లక్ష్మీశై, షబానా, రజిత, గోపమ్మ, జ్యోతి, అల్లజీ, వెంకటస్వామి, శైలు, శ్రీనివాస్ పాల్గొని మద్దతు తెలిపారు.

# కాప్రా జిహెచ్ఎంసి అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నరు

## జిహెచ్ఎంసి కమిషనర్‌కు పిర్యాదు చేసిన కాప్రా డివిజన్ కాంగ్రెస్ నేత పత్తి కుమార్



**కాప్రా, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు):-** కాప్రా డివిజన్‌లో రోడ్లు పూర్తిగా దెబ్బతిని, గుంతలతో నిండిపోయి వాహనదారులు, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకుండా నాన్యత లేని పనులు చేపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నేత, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ జిహెచ్ఎంసి కమిషనర్‌కు పిర్యాదు చేశారు.

వినాయక నిమజ్జన వేడుకల సమయంలో వేలాది మంది ప్రజలు ప్రయాణించే అవకాశం ఉన్న నేపథ్యంలో, ముందస్తుగా సరైన మరమ్మత్తులు చేయకుండా తాత్కాలికంగా ఉపరితలాన్ని మాత్రమే ప్యాచ్ వర్క్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. "ప్రజల కష్టాలను గుర్తించి, నాణ్యతతో పనులు చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన అధికారులు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉంది" అని పేర్కొన్నారు.ప్రత్యేకంగా ఎల్లారెడ్డి గూడ , జమ్మిగడ్డ మార్కెట్ రోడ్డు పరిధిలోని రహదారులు అధ్వానంగా మారినప్పటికీ, ఇప్పటివరకు పూర్తి స్థాయి మరమ్మత్తులు చేయలేదని ఆయన తెలిపారు. వాహనదారులు, కాలనీ ప్రజలు రోజూ పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, "సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వంపై నమ్మకం తగ్గిపోతుంది" అన్నారు.అదే సమయంలో, "గేటెడ్ కమిటీ" పేరుతో కొన్ని కాలనీల్లో——ప్రత్యేకంగా ఎన్ ఆర్ ఐ కాలనీ వంటి ప్రాంతాల్లో——రోడ్లు, పార్కుల నిర్మాణంలో అవినీతి జరిగిందని, వాటిపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పత్తి కుమార్ మాట్లాడుతూ," ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా నాణ్యతతో పనులు చేయాలి. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. కానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉంది. తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని తెలిపారు.ఈ పిర్యాదుపై జిహెచ్ఎంసి అధికారుల స్పందన ఏమిటన్నది ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించింది.

# కాలనీలో మౌలిక వసతులు పై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ పార్టీ

## నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప శ్రీనివాస్ రెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డ్‌లోని విజయపురి కాలనీ, అనురాగ్ సిరి రెసిడెన్సీ ప్రాంతంలో గత కొంత కాలంగా కొనసాగుతున్న మౌలిక వసతులు డ్రైనేజ్ మరియు తాగునీటి సమస్యలపై స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ అంతటా నిల్వ నీరు, సరైన డ్రైనేజ్ లేని పరిస్థితులు, తగినంత తాగునీటి సరఫరా లేకపోవడం వంటివి స్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.ఈ నేపథ్యంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి మున్సిపల్ డిఈ సంతోష్‌ను కలిసి సమస్యలను విపులంగా వివరించారు. కాలనీ అంతటా నెలకొన్న అసౌకర్యాలను, పిల్లలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.డిఈ సంతోష్ సమస్యలను శ్రద్ధగా విని, కమిషనర్ కు సమాచారం అందజేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమై న తాగునీటి సరఫరాను సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని, డ్రైనేజ్ సమస్యను కూడా తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు డిఈ ఇచ్చిన హామీపై సంతృప్తిని వ్యక్తం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని, తద్వారా కాలనీ ప్రజలకు ఉపశమనం కలగాలని కోరుతున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## పదేళ్లుగా వాళ్లను కాపాడుతుంది ఈసీనే: ఖర్గే

బెంగళూరు: ఎన్నికల కమిషన్ పై మరోసారి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్లుగా ఈసీ ఓటు చోరులను కాపాడుతూ వస్తుందని ఆరోపించారు. కీలకమైన సమాచారాన్ని దాచి పెట్టిందని విమర్శించారు. 2023 కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుండి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలమైన డేటాను ఇప్పటి వరకు కమిషన్ బయటపెట్టలేదన్నారు. 2023 ఎన్నికల ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల వేల మంది ఓటర్లు ఓటు హక్కును కోల్పోయారన్నారు. దీనికి సంబంధించిన స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి ఓటు చోరీ వెనక ఉన్నవారిని ఈసీ సమర్థంగా రక్షించిందని చెప్పారు. ఓటు చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడడమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పనిచేస్తుందని తెలిపారు. దానికోసం చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదన్నారు. అప్పుడు కర్ణాటకలో చేసిన విధంగానే ప్రస్తుతం బిహార్‌లో కూడా ఓటు చోరీకి పాల్పడడానికి కేంద్రం, ఈసీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగా బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని ఓట్ల చోరీ ద్వారా గెలిచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోనే కాకుండా మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఓటు చోరి చేసిందని అన్నారు. త్వరలోనే ఎన్డీఏ డబుల్ ఇంజిన్ సర్కార్ కూలిపోతుందని, ఓటు చోరీకి వ్యతిరేకంగా బిహార్ లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందని అన్నారు.



## ఆగని ఇజ్రాయిల్ మారణహోమం

వేలాది మంది పాలస్తీనియన్లు మతి చెందినా ఇజ్రాయిల్ మారణహౌమాన్ని ఆపడం లేదు. తాజాగా గాజాపై శుక్రవారం జరిపిన దాడులతో ఏడుగురు చిన్నారులతో సహా 50 మందికిపైగా పాలస్తీనియన్లు మతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. అలాగే శనివారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిరది. ఉత్తర గాజాలోని పాలస్తీనియన్ల ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గాజా నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక ఎత్తైన భవనాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్వంసం చేసింది. దీంతో అక్కడ కూడా నరక ద్వారాలు తెరుచుకున్నాయని ఇజ్రాయిల్ రక్షణశాఖ మంత్రి ఇటామర్ బెన్‌గ్విర్ అన్నారు. శనివారం అల్ షిఫా ఆస్పత్రిపై జరిపిన దాడిలో ఒక చిన్నారుతో సహా ఐదుగురు మతి చెందారు. అలాగే అల్ షుహాదా స్క్వేర్‌కు పశ్చిమాన ఉన్న శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం బాంబుదాడికి పాల్పడడంతో ఐదుగురు మతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కాగా, అక్టోబర్ 7, 2023లో మొదలైన గాజాపై ఇజ్రాయిల్ దాడిలో అధికారిక లెక్కల ప్రకారం 64,300 మంది చనిపోయారు. 162,005 మంది గాయాలపాలయ్యారు.

## వెనిజులాపై దాడులకు అమెరికా యత్నాలు

వెనిజులాలో మాదక ద్రవ్యాల వ్యాపారం చేసే వారిపై పోరాడే పేరుతో ఎఫ్35 యుద్ధ విమానాలను పుయర్టో రికోలో మోహరించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఆదేశించారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై ఒత్తిడి పెంచడానికి ట్రంప్ ఈ ఎత్తుగడ పన్నారని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పది యుద్ధ విమానాలను పుయర్టో రికో వైమానిక క్షేత్రానికి పంపడం జరిగిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లాటిన్ అమెరికాకు చెందిన మాదక ద్రవ్యాల వ్యాపారులు వెనిజులాలో కార్యకలాపాలు సాగిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. ఈ వ్యాపారులను 'నార్కో ఉగ్రవాద' సంస్థలుగా చూపుతోంది. వెనిజులా భూభాగంలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసే ముఠాలపై దాడులు చేయాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోందని సీఎన్ఎస్ వార్తా సంస్థ తెలిపింది. వెనిజులాలోనూ, మొత్తంగా లాటిన్ అమెరికాలోనూ హింసకు ఆజ్యం పోసే ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని అమెరికాను మదురో హెచ్చరించారు. సార్వభౌమత్వాన్ని, శాంతి హక్కును, స్వతంత్రతను అమెరికా గౌరవించాలని హితవు పలికారు. 'నేను ట్రంప్‌ను గౌరవిస్తాను. మా మధ్య విభేదాలు సైనిక ఘర్షణకు దారితీయకూడదు' అని అభిప్రాయపడ్డారు. చర్చలకు వెనిజులా ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. ఒకవేళ వెనిజులాపై దాడి జరిగితే అది వెంటనే సాయుధ ఆందోళనకు దారితీస్తుందని మదురో ఈ వారం ప్రారంభంలోనే చెప్పారు. అయితే వెనిజులాలో అధికార మార్పిడి గురించి అమెరికా మాట్లాడడం లేదని ట్రంప్ అన్నారు. అక్కడ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని మాత్రమే కోరుకుంటోందని తెలిపారు. వెనిజులా ప్రాదేశిక జలాల వెలుపల అమెరికా ఇప్పటికే యుద్ధ విమానాలను, నౌకాదళ సిబ్బందిని, అణు శక్తితో అత్యంత వేగంగా దాడి చేయగల జలాంతర్గాములను మోహరించింది. కాగా తన క్షిపణి విధ్వంసక యూఎస్ఎస్ జాసన్ దన్‌హామ్ సమీపంలో ఎగిరేందుకు వెనిజులా రెండు ఎఫ్16 ఫైటర్ విమానాలను పంపి కవ్వింపు చర్యలకు పాల్పడిరదని అమెరికా ఆరోపించింది. వెనిజులా జెట్ విమానాలు తమ నౌకలకు హాని కలిగిస్తాయని షిప్ కమాండర్లు భావిస్తే వాటిని కూల్చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని ట్రంప్ చెప్పారు.

# మహాఘట్‌బంధన్‌లో సీట్ల హెడేక్.. గత పెర్ఫార్మెన్స్ ఆధారంగా సీట్లు ఇస్తారా?



**బీహార్:** బిహార్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో సీట్ల పంపకం మరింత జటిలంగా మారుతోంది. విపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో మరో రెండు కొత్త పార్టీలు చేరడంతో ఈ లెక్కలు మరింత క్లిష్టంగా మారాయి. హేమంత్ సోరెన్‌కు చెందిన జార్ఖండ్ ముక్తి మోర్చా, పశుపతి పరస్‌కు చెందిన ఎల్జేపీ ఈ విపక్ష కూటమిలో చేరాయి. దీంతో ఈ కూటమిలోని పార్టీల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే కాంగ్రెస్, సీపీఐఎంఎల్ పార్టీలు గత ఎన్నికల్లో తమకు కేటాయించిన వాటికంటే ఎక్కువ సీట్లు ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్న నేపథ్యంలో.. కొత్త పార్టీలు కూటమిలో చేరడం ఈ లెక్కలను మరింత జటిలం చేసింది. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ సీట్లు ఉండగా.. వీటిని ఈ 8 పార్టీలు ఎలా పంచుకుంటాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. పశుపతి పరస్‌ను ఉపయోగించుకొని పాశ్వాన్ కుటుంబానికి పడే ఓట్లను చీల్చేందుకు విపక్ష కూటమి ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా పాశ్వాన్ కుటంబం స్వస్థలమైన ఖగారియా వంటి సీట్లలో పరస్ కార్డుతో ఫలితాలను మార్చేందుకు మహాఘట్‌బంధన్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. కాబట్టి తమకు కనీసం 23 సీట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారట. ఈ సీట్లలో తను, తన కుమారుడు పోటీ చేయాలనేది ఆయన ప్లాన్. ఇక జార్ఖండ్‌లో అధికారంలో ఉన్న జేఎంఎం.. ఆర్జేడీ, కాంగ్రెస్ రెండు పార్టీలకు కేబినెట్ బెర్తులు ఇచ్చి ప్రభుత్వంలో భాగస్వాములను చేసింది. కాబట్టి ఆ పార్టీకి బిహార్‌లో కూడా సీట్లు కేటాయించడం కూటమి బాధ్యతగా మారింది. అలా చేయకపోతే జార?ండ్‌లో పవర్‌ఫుల్‌గా ఉన్న జేఎంఎం.. ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పేసే ప్రమాదముంది. ఈ క్రమంలోనే జార్ఖండ్ బోర్డర్‌కు సమీపంలోని బంకా, ముంగర్, భగల్‌పూర్ వంటి సీట్లు తమకు కేటాయించాలని జేఎంఎం డిమాండ్ చేస్తోంది. ఇక ముకేష్ సాహ్నీ నేతృత్వంలోని వీఐపీ (వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ) ఏకంగా 50 సీట్లు కావాలని అడుగుతోంది. కూటమి గెలిస్తే తనకు డిప్యూటీ సీఎం పదవి కూడా ఇవ్వాలని సాహ్నీ ఇప్పటికే డిమాండ్ చేశారు. ఏదో ఒకటి చేసి 2025 సీట్లకు సాహ్నీని ఒప్పించాలని కూటమి పెద్దలు భావిస్తున్నారట. దీంతో కాంగ్రెస్ సీట్లలో కోత పడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక గత ఎన్నికల్లో మెరుగైన ప్రదర్శన చేసిన సీపీఐఎంఎల్ కూడా తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలుస్తోంది.

## కొనసాగుతోన్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో డిమాండ్ల సాధన కోసం నిరసన చేపట్టిన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 14వేల మంది కాంట్రాక్టు సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు చేసిన విషయం కూడా విదితమే. అయినప్పటికీ అక్కడి బీజేపీ సర్కారులో మాత్రం ఎలాంటి చలనమూ కనబడటం లేదు. దీంతో రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. విద్యా సంస్థలలో వైద్య పరీక్షలు జరగటం లేవు. ఫలితంగా రోగులు, రోగుల బంధువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూస్తోంది. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కాగా 25 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తూ అక్కడి బీజేపీ సర్కారు ఉత్తర్వుల్విటం, ప్రభుత్వ చర్యను తప్పుపడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 14 వేల మంది కాంట్రాక్ట్ సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించటం రాష్ట్రంలో సంచలనంగా మారిన విషయం విదితమే. కాగా న్యాయబద్ధమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉద్యోగులు ప్రారంభించిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత నెల 18న ఆందోళన ప్రారంభించారు. తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలనీ, మెరుగైన వేతనాలు అందించాలనీ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని వారు ప్రధానంగా కోరుతున్నారు. ఉద్యోగుల పది డిమాండ్లలో నాలుగింటిని ఎన్‌హెచ్‌ఎం ఎగ్జిక్యూటివ్ కమిటీ గత నెల 13న ఆమోదించిందని అధికారులు చెబుతుండగా.. నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదని ఉద్యోగ సంఘం ఆరోపించింది. సమ్మెను కొనసాగించాలన్న యోచన తమకేమీ లేదనీ, అయితే ప్రభుత్వం చర్చలకు అవకాశం కల్పించడం లేదని ఉద్యోగాన్ని కోల్పోయిన హేమంత్ కుమార్ సిన్హా చెప్పారు. కాంట్రాక్ట్ ఆరోగ్య కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని 2023 శాసనసభ ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ హామీ ఇచ్చిందని ఎన్‌హెచ్‌ఎం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అమిత్ మిరి గుర్తు చేశారు. ఇది ప్రధాని మోడీ ఇచ్చిన గ్యారంటీ అని కూడా చెప్పారని తెలిపారు.

## భారత్‌తో సంబంధం ప్రత్యేకమైనది



రష్యా నుంచి చమురు కొనుగోలు, అమెరికా వస్తువులను తన మార్కెట్‌లోకి అనుమతించేందుకు నిరాకరించడం, చైనాతో స్నేహ సంబంధాలను కొనసాగించడం వంటి భారత్ చర్యలు అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్‌ను ఆగ్రహానికి గురి చేస్తున్న విషయం తెలిసిందే. భారత్‌ను చైనాకు కోల్పోయామంటూ ఆయన తాజాగా తన ట్రూత్ సోషల్ వేదికలో వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు వీటన్నింటికీ భిన్నంగా ట్రంప్ తన ఓవల్ కార్యాలయంలో పాత్రికేయులతో ముచ్చటిస్తూ భారత్, అమెరికా మధ్య ప్రత్యేక సంబంధం ఉన్నదని చెప్పారు. ఈ సంబంధాలకు విఘాతం కలుగుతుందంటూ వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. 'విచారించాల్సిన అవసరమే లేదు. కొన్ని సందర్భానుసారంగా అలా జరిగిపోతూ ఉంటాయి' అని ట్రంప్ తెలిపారు. ప్రధానితో తన వ్యక్తిగత బంధం చెక్కుచెదరకుండా అలాగే ఉండిపోతుందని చిరునవ్వుతో అన్నారు. 'మోడీతో నా స్నేహం ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. ఆయన చాలా గొప్ప ప్రధాని. గొప్ప వ్యక్తి. మేము ఎప్పుడూ స్నేహితులమే. అయితే ఆయన ప్రస్తుతం చేస్తున్న పని నాకు నచ్చడం లేదు' అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్ వెలుగు చూడగానే మోడీ వెంటనే దానిని తన ఎక్స్ ఖాతాలో కోట్ చేశారు. మాస్కో నుంచి భారత్ నిరంతరం చమురును కొనుగోలు చేస్తుండడంపై ట్రంప్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురును కొనుగోలు చేయడం నన్ను ఎంతగానో అసంతృప్తికి గురిచేసింది. ఆ విషయాన్ని వారికి తెలియజేశాను. మేము భారత్‌పై భారీ సుంకాన్ని విధించాం. యాభై శాతం టారిఫ్%ా%చాలా ఎక్కువ సుంకం. మోడీతో నేను బాగానే ఉంటున్నాను. ఆయన చాలా గొప్ప వ్యక్తి. కొన్ని నెలల క్రితం ఇక్కడికి వచ్చారు' అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ స్పందిస్తూ ఆయన అభిప్రాయాలను, తమ సంబంధాలపై ఆయన సానుకూల అంచనాను గౌరవిస్తానని తెలిపారు. భారత్, అమెరికా దేశాలు సానుకూలమైన, ముందుచూపుతో కూడిన సమగ్ర, అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని మోడీ చెప్పారు.

## ఎనిమిదికి చేరిన మహాఘట్‌బంధన్ పార్టీల సంఖ్య

పాట్నా: బిహార్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో సీట్ల పంపకం మరింత జటిలంగా మారుతోంది. ఇప్పటికే ఎన్డీయే. మహాఘట్‌బంధన్ కూటములు ఈ అంశంపై చర్చలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే ఈ చర్చల్లో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. అధికార ఎన్డీయే కూటమిలో చిరాగ్ పాశ్వాన్, జీతన్ రామ్ మాంఝీa, ఉపేంద్ర కుశావహ తదితరుల డిమాండ్లతో సీట్ల పంపకం సమస్యాత్మకంగా మారుతోందట. ఇప్పటికే పలుమార్లు సీఎం నితీశ్ కుమార్‌ను, ఆయన విధానాలను బహిరంగంగానే చిరాగ్ పాశ్వాన్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సరిగా లేదని కూడా పాశ్వాన్ ఆరోపించడం బిహార్ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఎన్డీయేలో సమస్యల నేపథ్యంలో మహాఘట్‌బంధన్‌లో అంతా సజావుగా సాగిపోతుందనుకుంటే పొరబాటే. ఎందుకంటే ఈ కూటమిలో కూడా సీట్ల లెక్కలు తలనొప్పులు సృష్టిస్తున్నాయి. దీనికితోడు తాజాగా హేమంత్ సోరెన్‌కు చెందిన జార?ండ్ ముక్తి మోర్చా, పశుపతి పరస్‌కు చెందిన ఎల్జేపీ కూడా విపక్ష కూటమిలో చేరాయి. దీంతో ఈ కూటమిలోని పార్టీల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే కాంగ్రెస్, సీపీఐఎంఎల్ పార్టీలు గత ఎన్నికల్లో తమకు కేటాయించిన వాటికంటే ఎక్కువ సీట్లు ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్న నేపథ్యంలో.. కొత్త పార్టీలు కూటమిలో చేరడం ఈ లెక్కలను మరింత జటిలం చేసింది.

## రష్యా క్యాన్సర్ వ్యాక్సిన్ సిద్ధం

ప్రాణాంతక క్యాన్సర్ నివారక మందు ఎంటెరోమిక్స్ వ్యాక్సిన్‌ను రష్యా శాస్త్రజ్ఞులు రూపొందించారు. ప్రయోగశాల పరీక్షలకు దీనిని సిద్ధం చేశారు. ఎంఆర్ఎన్ఎ టెక్నాలజీ ఆధారంగా ఈ టీకాను తయారు చేసినట్లు శాస్త్రజ్ఞులు తెలిపారు. కొవిడ్ 19 టీకాను కూడా ఈ పద్ధతిలోనే కరోనా దశలో విజయవంతంగా రూపొందించారు. మనిషి శరీరంలో క్యాన్సర్ కణాలను దెబ్బతీసేందుకు వీలుగా ఈ టీకా ప్రోటీన్లను ఉత్పత్తి చేస్తుంది. మనిషి కణజాలంలోని క్యాన్సర్ కారక కణాలను గుర్తించి, వాటిపై దాడికి ఈ వ్యాక్సిన్ ద్వారా వీలేర్పడుతుంది. కణజాలాల్లోని శక్తివంతమైన రోగనిరోధక శక్తిని ప్రాతిపదికగా చేసుకుని రూపొందించే శాస్త్రీయ పద్ధతిని ఎంఆర్ఎన్ఎ టెక్నాలజీగా వ్యవహరిస్తారు. ప్రస్తుతానికి క్లినికల్ టెస్టులకు దీనిని పంపించారు. అక్కడ కూడా దీని పనితీరు బాగా ఉంటే, దీనిని రష్యా ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేసుకుంది. క్యాన్సర్ టీకా గురించి రష్యాకు చెందిన ఔషధ అధికారిక ఫెడరల్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఏజెన్సీ (ఎఫ్ఎంబిఎ) అధికార ప్రకటన వెలువరించింది. సంవత్సరాల తరబడి సాగిన పరిశోధనల తరువాత ఈ టీకాను రూపొందించినట్లు సంస్థ డైరెక్టర్ వెరోనిక స్కదర్‌త్సోవ తెలిపారు. ట్రయల్స్‌లో సంతృప్తికర ఫలితాలు వచ్చాయని వివరించారు. ప్రత్యేకించి క్యాన్సర్ కణాలను లక్షంగా చేసుకునే ఈ టీకా పనిచేస్తుంది. క్రమపద్ధతిలో ఈ టీకాను అన్ని రకాల క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల చికిత్సకు వాడేందుకు వీలుంటుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సిన్నర్‌కు చుక్కలు చూపించిన అల్కరాజ్..

యూఎస్ ఓపెన్ 2025 టైటిల్‌ను మరోసారి కార్లోస్ అల్కరాస్ గెలుచుకున్నాడు. ఇది అతనికి రెండో యూఎస్ ఓపెన్ టైటిల్. ఈ టైటిల్ గెలవడానికి, అతను ఫైనల్‌లో ఇటలీకి చెందిన యానిక్ సిన్నర్ ను ఓడిరచాడు. ఈ విజయంతో అల్కరాస్ వరల్డ్ నంబర్ 1 ర్యాంకును తిరిగి దక్కించుకున్నాడు. ఇటలీకి చెందిన యానిక్ సిన్నర్ పై స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాస్, యూఎస్ ఓపెన్ 2025 ఫైనల్‌ను 62, 36, 61, 64 తేడాతో గెలుచుకున్నాడు. ఇది అతనికి రెండో యూఎస్ ఓపెన్ టైటిల్, మొత్తం ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఈ విజయంతో అతను 65 వారాలుగా ప్రపంచ నంబర్ 1 స్థానంలో ఉన్న సిన్నర్ ను వెనక్కి నెట్టేశాడు. వీరిద్దరి మధ్య ఇది మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్. ఈ విజయంతో అల్కరాస్ 21 ఆధిక్యంలో ఉన్నాడు. హార్డ్ కోర్టులో ఇప్పటివరకు జరిగిన 9 మ్యాచ్‌లలో అల్కరాస్ 72తో సినర్‌పై ఆధిపత్యం కొనసాగించాడు. మొత్తం 15 మ్యాచ్‌లలో అల్కరాస్ 105తో సినర్‌పై ముందంజలో ఉన్నాడు. మొత్తం 2 గంటల 42 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో, మొదటి సెట్‌ను అల్కరాస్ సులభంగా గెలుచుకున్నాడు. రెండో సెట్‌లో సినర్ పుంజుకున్నప్పటికీ, మూడో సెట్‌లో



అల్కరాస్ 61తో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. కీలకమైన నాలుగో సెట్‌లో ఇద్దరు ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. ఒత్తిడిని అధిగమించిన అల్కరాస్ సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచాడు. యూఎస్ ఓపెన్ గెలిచి ప్రపంచ నంబర్ 1 అయిన కార్లోస్ అల్కరాస్ తన విజయాన్ని వినూత్నంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. అతను షాంపైన్ జల్లుతో పాటు కోర్టులో క్రికెట్ ఆడినట్లుగా సంబరాలు చేసుకున్నాడు. అల్కరాస్ విజయం తర్వాత ఒక బ్యాట్స్‌మెన్ ఎలాగైతే షాట్ ఆడతాడో, అదే విధంగా బ్యాట్ పట్టుకున్నట్లుగా పోజు ఇచ్చి తన ఆనందాన్ని పంచుకున్నాడు. ఈ సెలెబ్రేషన్స్ చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు.



# ఉత్కంఠగా మారిన దులీప్ ట్రోఫీ ఫైనల్..

భారత దేశవాళీ క్రికెట్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సౌత్ జోన్ మరియు సెంట్రల్ జోన్ జట్లు అర్హత సాధించాయి. సెప్టెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకు బెంగళూరులోని అత్యంత ఆధునికమైన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్టేడియంలో ఈ తుది సమరం జరగనుంది. రెండు బలమైన జట్ల మధ్య జరగనున్న ఈ ఫైనల్ మ్యాచ్ క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతోంది. సెమీఫైనల్‌లో రెండు మ్యాచ్‌లు కూడా డ్రాగా ముగియడం ఈ టోర్నమెంట్‌లో ఒక ఆసక్తికరమైన అంశం. నిబంధనల ప్రకారం, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జట్లను విజేతలుగా ప్రకటించారు. ఈ క్రమంలో, మొదటి సెమీఫైనల్‌లో సౌత్ జోన్ జట్టు ఉత్తరాంచల్ జోన్‌పై మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. అదేవిధంగా, రెండో సెమీఫైనల్‌లో సెంట్రల్ జోన్ జట్టు, స్టార్ ఆటగాళ్లు జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ వంటివారితో కూడిన వెస్ట్ జోన్‌ను మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఓడిరచి ఫైనల్‌కు అర్హత సాధించింది. దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో వెస్ట్ జోన్ వంటి పటిష్టమైన జట్టును సెమీఫైనల్‌లోనే ఓడిరచడం సెంట్రల్ జోన్ యొక్క అద్భుతమైన ప్రదర్శనకు నిదర్శనం. ముఖ్యంగా స్టార్ ఆటగాళ్లు లేకుండానే సెంట్రల్ జోన్ ఈ విజయాన్ని సాధించడం వారి బృంద స్ఫూర్తికి, దృఢత్వానికి నిలువుటద్దం. మరోవైపు, సౌత్ జోన్ జట్టు కూడా టోర్నమెంట్ అంతటా స్థిరమైన ప్రదర్శనను కనబరిచింది. వారి ఆటగాళ్ల అద్భుతమైన ప్రతిభ ఫైనల్‌లో ఏ మేరకు ప్రభావితం చేస్తుందో చూడాలి. వెస్ట్ జోన్ జట్టు సెమీస్‌కే పరిమితం కావడం కొంత నిరాశ కలిగించినప్పటికీ, ఫైనల్‌లో సౌత్ జోన్ మరియు సెంట్రల్ జోన్ జట్ల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. దులీప్ ట్రోఫీ చరిత్రలో ఈ రెండు జట్లు తలపడటం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. క్రికెట్ విశ్లేషకులు ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎవరు విజయం సాధించి ట్రోఫీని గెలుచుకుంటారో వేచి చూడాలి.

# అర్హత ఉన్నా చోటు దక్కకపోతే..: శ్రేయస్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు

తుది జట్టులో ఉండడానికి అర్హత ఉండి కూడా, కనీసం జట్టులోకి కూడా ఎంపిక కాకపోతే ఏ ఆటగాడైనా అసహనానికి గురవుతాడని టీమ్‌ఇండియా బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు. వన్డేల్లో కీలక ఆటగాడిగా ఎదిగిన శ్రేయస్‌కు ఏడాదికి పైగా టెస్టు జట్టులో చోటు లేదు. అతను టీ20ల్లో ఆడి రెండేళ్లవుతోంది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు శ్రేయస్‌ను ఎంపిక చేయని సెలక్టర్లు.. ఆసియా కప్




టీ20 టోర్నీకి కూడా దూరం పెట్టారు. ఈ నేపథ్యంలో శ్రేయస్ ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ''జట్టులో, తుది 11 మందిలో ఉండడానికి అర్హత ఉన్నా మనల్ని ఎంపిక చేయకపోతే అసహనం కలుగుతుంది. కానీ అదే సమయంలో అవకాశం లభించిన ప్రతి చోటా ఉత్తమ ప్రదర్శన చేస్తూ పోవాలి. నిలకడగా రాణిస్తూ ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టును గెలిపించడానికి ప్రయత్నించాలి. మన పనిని నైతికతతో చేస్తూ వెళ్లాలి. ఎవరో చూస్తున్నారని పని చేయకూడదు. మనపై ఎవరి దృష్టి లేకపోయినా పని చేసుకుంటూ, నిబద్ధతతో సాగడం ముఖ్యం'' అని శ్రేయస్ అన్నాడు. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలో నిలకడగా రాణించి జట్టు టైటిల్ అందుకోవడంలో శ్రేయస్ కీలక పాత్ర పోషించాడు. ఆ గెలుపు తన కెరీర్లో ఎంతో మధురమైందని అతనన్నాడు.

# ఆసియా కప్‌లో టీమిండియాకు తిరుగులేని రికార్డు..

ఆసియా కప్పా.. అయితే టైటిల్ మనదే.. భారత క్రికెట్ అభిమానుల ధీమా ఇది. ఫ్యాన్సే కాదు మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు టీమిండియానే ఫేవరెట్ అని చెబుతున్నారు. అంత నమ్మకంగా ఉండటానికి టోర్నీలో టీమిండియాకు ఉన్న తిరుగులేని రికార్డే కారణం. ఆసియా కప్ ప్రారంభం నుంచి టీమిండియా ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. 1984 నుంచి ఆసియా కప్ మొదలైంది. తొలి ఎడిషన్‌లోనే భారత్ టైటిల్ సాధించింది. ఇప్పటివరకు 16 ఎడిషన్లు పూర్తవ్వగా ఏకంగా 11 సార్లు ఫైనల్‌కు చేరుకుంది. అందులోనూ 8సార్లు(1984, 1988, 199091, 1995, 2010, 2016, 2018, 2023) టైటిల్ గెలవడం విశేషం. ఆసియా కప్‌లో అత్యధిక సార్లు టైటిల్ గెలిచిన జట్టు టీమిండియానే. ఆసియా కప్‌లో ఘనమైన రికార్డు కలిగిన భారత్ ఇప్పుడు 9వ టైటిల్‌పై కన్నేసింది. మంగళవారం నుంచి ఆసియా కప్ ప్రారంభంకానుంది. ఈ సారి కూడా సూర్య సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. టీమిండియా 8సార్లు ఆసియా కప్ గెలిచింది. టోర్నీలో అత్యధికసార్లు టైటిల్ గెలిచిన జట్టుగా టీమిండియా రికార్డు



కలిగి ఉంది. భారత్ తర్వాత శ్రీలంక సెకండ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ జట్టుగా ఉంది. ఆ జట్టు 6సార్లు విజేతగా నిలిచింది. పాకిస్తాన్ రెండో సార్లు గెలిచింది. ఆసియా కప్ వరుసగా మూడు సార్లు గెలిచిన ఏకైక జట్టు భారతే. వరుసగా 1988, 199091, 1995లలో విజేతగా నిలిచింది. ఆసియా కప్‌లో భారీ విజయం(పరుగుల పరంగా) సాధించిన రికార్డు కూడా టీమిండియా పేరిటే ఉంది. 2008లో హాంకాంగ్‌పై 256 పరుగుల తేడాతో గెలిచింది. అతి తక్కువ బంతుల్లో ఫైనల్ గెలిచిన రికార్డు భారత్ సొంతం .2023లో శ్రీలంకతో జరిగిన టైటిల్ పోరులో ఈ ఘనత సాధించింది. అప్పుడు శ్రీలంక 50 పరుగులకే ఆలౌటవ్వగా.. లక్ష్యాన్ని టీమిండియా 37 బంతుల్లోనే ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఆసియా కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉంది. ఆసియా కప్‌లో అతను 37 మ్యాచ్‌లు ఆడి 40 సిక్సర్లు బాదాడు.



# భారత్ మళ్లీ వరల్డ్ ఛాంపియన్ అవుతుందా?

భారత పురుషుల హాకీ జట్టు మరోసారి ఆసియా కప్‌ను గెలుచుకుంది. హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు ఎనిమిది సంవత్సరాల తర్వాత పురుషుల హాకీ ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. రాజ్‌గీర్‌లో జరిగిన ఫైనల్‌లో భారత జట్టు డిఫెండిరగ్ ఛాంపియన్ సౌత్ కొరియాను 41తో ఓడిరచి నాలుగవసారి ఈ టోర్నమెంట్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో టీమిండియా నేరుగా నెదర్లాండ్స్, బెల్జియంలో జరగబోయే ఎఫ్?ఐహెచ్ పురుషుల హాకీ వరల్డ్ కప్ 2026కు అర్హత సాధించింది. బీహార్‌లోని రాజ్‌గీర్‌లో తొలిసారిగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో, భారత జట్టు మొదటి నుంచి ఫేవరెట్‌గా ఉంది. కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ సారథ్యంలోని టీమిండియా.. టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఛాంపియన్‌గా నిలిచింది. పూల్ స్టేజ్‌లో టీమిండియా తమ మూడు మ్యాచ్?లలో విజయం సాధించింది. ఆ తర్వాత సూపర్4లో మూడు మ్యాచ్?లలో రెండు గెలిచి, ఒక మ్యాచ్?ను డ్రా చేసుకుంది. ఆ డ్రా అయిన మ్యాచ్ కూడా కొరియాతోనే, అది 22తో ముగిసింది. సెప్టెంబర్ 7, ఆదివారం నాడు జరిగిన ఫైనల్‌లో, భారత జట్టు మొదటి నిమిషంలోనే గోల్ చేసి 10 ఆధిక్యాన్ని సాధించింది. సుఖ్‌జీత్ తొలి గోల్ చేసి టీమిండియాకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. ఆ తర్వాత రెండో గోల్ కోసం చాలాసేపు ఎదురుచూడాల్సి వచ్చింది. ఫస్ట్ హాఫ్ ముగియడానికి రెండు నిమిషాల ముందు దిల్‌ప్రీత్ సింగ్ గోల్ చేసి స్కోరును 20కు పెంచాడు. రెండో హాఫ్?లో కూడా భారత జట్టు ఆధిపత్యం కొనసాగించింది. కానీ కొరియా డిఫెన్స్‌ను ఛేదించడం అంత సులభం కాదు. అయినా కూడా, 45వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ తన రెండో గోల్ చేసి స్కోర్‌ను 30కు పెంచాడు. ఆ తర్వాత సౌత్ కొరియా గెలుపు దాదాపు అసాధ్యం అయిపోయింది. 50వ నిమిషంలో అమిత్ రోహిదాస్ చేసిన గోల్ కొరియా ఆశలను పూర్తిగా తుడిచిపెట్టేసింది. 57వ నిమిషంలో సౌత్ కొరియా ఒక గోల్ చేయగలిగింది. అయితే అది కేవలం గోల్‌స్‌ను 41కు మార్చడానికి మాత్రమే ఉపయోగపడిరది. భారత జట్టు ఆసియా కప్ ఫైనల్స్ ఆడడం ఇది తొమ్మిదోసారి. నాలుగవసారి ఛాంపియన్‌గా నిలిచింది. చివరిసారిగా 2017లో ఆసియా కప్ టైటిల్ గెలుచుకుంది. ఆసియా కప్ టైటిల్స్?లో భారత్ కంటే ఎక్కువ టైటిల్స్ గెలిచిన జట్టు సౌత్ కొరియా (5) మాత్రమే. ఇక ఫైనల్‌లో సౌత్ కొరియాపై భారత్ తన స్కోరును 22కు పెంచుకుంది. అంతకుముందు ఇరు జట్ల మధ్య మూడు ఫైనల్స్ జరిగాయి. ఇందులో సౌత్ కొరియా రెండు, భారత్ ఒక ఫైనల్ గెలుచుకున్నాయి.

# జింబాబ్వే కెప్టెన్ సంచలనం..
# కోహ్లీ, సూర్యల రికార్డు బద్దలు

క్రికెట్‌లో ఏ ఆటగాడు ఎప్పుడు చరిత్రను సృష్టిస్తాడో మనం అస్సలు ఊహించలేము. ఒకోసారి స్టార్ ఆటగాళ్ల రికార్డులను.. చిన్న జట్టులోని ఆటగాళ్లు తిరగరాస్తారు. ఇలాంటి ఘటనే శ్రీలంక, జింబాబ్వే మధ్య జరిగిన టి-20 మ్యాచ్‌లో చోటు చేసుకుంది. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అంతర్జాతీయ టి-20ల్లో చరిత్ర సృష్టించాడు. ఐసిసి ఫుల్ మెంబర్స్ దేశాల్లో అత్యధిక సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో టిం ఇండియి స్టార్లు విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్‌లను వెనక్కి నెట్టాడు. శనివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో మొత్తం రజా తన టి-20 కెరీర్‌లో 17 సార్లు ఈ అవార్డును అందుకున్నాడు. కోహ్లీ, స్కైలు 16 సార్లు ఈ అవార్డును సొంతం చేసుకున్నరు. ఓవరాల్‌గా ఐసిసి సభ్య దేశాలన్నీకలిపి టి-20ల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్న రికార్డు మలేసియా ఆటగాడు విరన్‌దీప్ సింగ్ పేరిట ఉంది. ఇతను 22 సార్లు ఈ అవార్డును సొంతం చేసుకున్నాడు.



# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడం లేదు

(మొదటి పేజీ తరువాయి)



యూరియా సమస్యపై తాము 20 రోజుల ముందే హెచ్చరించినా, రెండు ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాలేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల తరపున నిరసన తెలిపేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మేము ఎన్డీఏకు గానీ, ఇండియా కూటమికి గానీ జవాబుదారీ కాదు. కేవలం తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ'' అని ఆయన అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల బహిష్కరణను ఒక వేదికగా ఉపయోగించుకుని, తెలంగాణ రైతుల బాధలను దేశం దృష్టికి తీసుకెళుతున్నామని ఆయన పేర్కొన్నారు. తమ పోరాటం కేవలం రైతుల సంక్షేమం కోసమేనని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# తెలంగాణ బీజేపీకి షాకిచ్చిన సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో తెలంగాణ బీజేపీకి చుక్కెదురైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా దాఖలైన పరువు నష్టం దావా కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదే సమయంలో రాష్ట్ర బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

వివరాల ప్రకారం.. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తున్నారని, రిజర్వేషన్లను ఎత్తివేస్తారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ.. సుప్రీంకోర్టులో పరువు నష్టం దావా పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా బీజేపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్. గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు కోర్టులను వేదికగా చేసుకోవద్దు అని హితవు పలికారు. రాజకీయ నాయకులు వీటిని గట్టిగా ఎదుర్కోవాలి. రాజకీయపరమైన వ్యాఖ్యలు రాజకీయ స్ఫూర్తితోనే ఎదుర్కోవాలి అని వ్యాఖ్యానించారు. చివరగా.. పది లక్షల జరిమానా విధిస్తామని బీజేపీని హెచ్చరించారు. అనంతరం, పిటిషన్‌ను కొట్టివేశారు.

ఇదిలా ఉండగా.. గతంలో ఇదే విషయంపై బీజేపీ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సైతం కొట్టివేసింది. దీంతో, రాష్ట్ర బీజేపీ.. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా మరోసారి బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది.



# వెళ్లిపోతున్న విదేశీ నిధులు



భారతీయ స్టాక్ మార్కెట్లలో గత కొంతకాలంగా ప్రతికూల సెంటిమెంట్ కొనసాగుతోంది. ఫలితంగా మన మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను వెనక్కి తీసుకెళ్తున్నారు. డిపాజిటరీ డేటా ప్రకారం, సెప్టెంబర్ మొదటి వారంలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రూ. 12,257 కోట్ల విలువైన నిధులను ఉపసంహరించుకున్నారు. ఇందుకు ప్రధానంగా భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాలు, డాలర్ మారకం బలంగా ఉండటం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు కారణాలుగా ఉన్నాయి. గత నెలలో ఎఫ్‌పీఐలు రూ. 34,990 కోట్లను, అంతకుముందు జూలైలో రూ. 17,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2025లో ఇప్పటివరకు మొత్తం రూ. 1.43 లక్షల కోట్ల విదేశీ నిధులు మన ఈక్విటీల నుంచి వెళ్లాయని డిపాజిటరీ డేటా పేర్కొంది. రానున్న వారంలోనూ అమెరికా ఫెడ్ రేట్ల కోతపై వస్తున్న ఊహాగానాలు, అమెరికా లేబర్ డేటా, ఆర్‌బీఐ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, భారత రూపాయి మారకం వంటి అంశాలు ఎఫ్‌పీఐల నిధుల ఉపసంహరణపై ప్రభావితం చూపుతాయని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త జీఎస్టీ సంస్కరణల కారణంగా వ్యవస్థలో గిరాకీ పుంజుకుంటుందని, ప్రభుత్వం ఆదాయం మెరుగుపడుతుందనే అంచనాలున్నాయి. దీనికితోడు విధానపరమైన సంస్కరణలు ఎఫ్‌పీఐలను తిరిగి ఈక్విటీల్లో పెట్టుబడులను ఆకర్షించవచ్చని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ వెల్లడిరచారు.

# అబద్ధాల అంబాసిడర్‌గా కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి, ములుగులో వందలాది మందికి జీతాలు సమయానికి అందాయి. మహేష్ విషయంలో మాత్రమే ఇలాంటి నిర్లక్ష్యం జరిగింది, అది కూడా స్థానిక సిబ్బంది పొరపాటుతో జరిగింది.

బాధ్యులపై తక్షణ చర్య తీసుకొని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి, బిల్ కలెక్టర్‌ను విధులనుంచి తొలగించాము. మైదం మహేష్ కుటుంబానికి పరిహారం అందించడం జరిగింది. కింది స్థాయి సిబ్బంది కారణంగా మైదం మహేష్ జీతం ఆలస్యం అయ్యింది తప్ప బడ్జెట్ లేక కాదని జీతం అందుకున్న మిగిలిన కార్మికులు, కార్మిక నాయకులు స్పష్టం చేశారు. ములుగు నూతన మున్సిపాలిటీగా ఏర్పాటైయ్యింది. ఈ క్రమంలో పంచాయతీ పద్దు నుంచి మున్సిపాలిటీ శాఖలోకి కార్మికులను మార్చి జీతాల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది.

మంచి నీళ్లు అనుకుని పొరపాటున పురుగు మందు తాగానని మైదం మహేష్‌స్వయంగా చెప్పిన రికార్డులు ఉన్నాయి. అయినప్పటికీ దాన్ని రాజకీయంగా వాడుకోవడం, శవ రాజకీయాలు చేయడం కేటీఆర్ కే చెల్లింది.

కేటీఆర్ పదేపదే అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఒక అబద్ధాన్ని నూరుసార్లు చెప్పి నిజమని నమ్మించడమే గోబెల్స్ పాఠం. కానీ కేటీఆర్ దానిని మించి పోయాడు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు తన సొంత నియోజకవర్గంలో సర్పంచ్ లు, కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు పట్టించుకోలేదు. ముగ్గురు పిల్లలున్నారని ఆదుకోవాలని ఓ తల్లి విజ్ఞప్తి చేస్తే..నా కోసం పిల్లల్ని కన్నవా అని అవమానాలకు గురి చేశాడు. అలాంటి కేటీఆర్ ఇప్పుడు అధికారం పోగానే ప్రజల మీద కపట ప్రేమ ప్రదర్శించడం హాస్యాస్పదం గా ఉంది. మైదం మహేష్ విషయంలో కేటీఆర్ అబద్దాలు మానుకోని నిజాల మీద బతకాలి. మైదం మహేష్‌కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది.



# కార్లపై రూ. 2.40 లక్షల వరకు తగ్గింపు ప్రకటించిన హ్యూందాయ్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాలను వాహన తయారీ కంపెనీలు కస్టమర్లకు బదిలీ చేయడం ప్రారంభించాయి. ఇప్పటికే టాటా మోటార్స్, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, రెనో ఇండియా కంపెనీలు తగ్గింపు వివరాలను వెల్లడిరచగా, ఇదే బాటలో హ్యూందాయ్ కూడా నిలిచింది. ఆదివారం నాటి అధికారిక ప్రకటనలో హ్యూందాయ్ మోటార్ ఇండియా తన పోర్ట్‌ఫోలియోలోని కార్ల ధరలను గరిష్ఠంగా రూ. 2.40 లక్షల వరకు తగ్గించినట్టు వెల్లడిరచింది. ఈ తగ్గింపు వెర్నాపై రూ. 60,640 నుంచి ప్రీమియం ఎస్‌యూవీ టక్సన్‌పై రూ. 2.40 లక్షల వరకు ఉంటుందని తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి వర్తిస్తాయని పేర్కొంది. జీఎస్టీ సంస్కరణలు వాహన పరిశ్రమకు ఊతమివ్వడమే కాకుండా లక్షలాది మంది కస్టమర్లకు సరసమైన ధరలో వాహనాలు లభిస్తాయని హ్యూందాయ్ మోటార్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్ చెప్పారు. ఇదే సమయంలో దేశీయ వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ కమర్షియల్ వాహనాల ధరలను కూడా సవరించినట్టు ప్రకటించింది. జీఎస్టీ తగ్గింపు పూర్తి ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తన కమర్షియల్ వాహనాల ధరలను రూ. 30,000 నుంచి రూ. 4.65 లక్షల వరకు తగ్గించినట్టు పేర్కొంది.

# భారత్‌లో చిన్న ఈవీ కార్లను తీసుకొస్తాం

భారత్ మార్కెట్లో సరసమైన, చిన్న ఎలక్ట్రిక్ కార్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నామని ప్రముఖ కార్ల తయారీ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ అభిప్రాయపడిరది. మెరుగైన వ్యూహంతో ఈ విభాగంలో వాహనాలను తీసుకొచ్చేందుకు భాగస్వాములతో చర్చిస్తున్నామని కంపెనీ సీఈఓ ఆలివర్ బ్లూమ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఇప్పటికే ప్రపంచంలో మూడో అతిపెద్ద వాహన మార్కెట్‌గా ఉన్న భారత్, మరింత ఆకర్షణీయంగా మారుతుంది. ఎలక్ట్రిక్ చిన్న కార్ల విభాగంలో 'ఐడీ క్రాస్ కాన్సెప్ట్ కింద కంపెనీ స్కోడా కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ ఎపిక్‌తో పాటు, పోలో, కుప్రా కార్లను తీసుకురానుంది. ఎలక్ట్రిక్ అర్బన్ కార్ ఫ్యామిలీ కింద సరసమైన ధరలో వివిధ బ్రాండ్లలో ఎంట్రీ లెవల్ ఎలక్ట్రిక్ కార్లపైనా పనిచేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగానే ఆయన భారత మార్కెట్‌పై ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ మార్కెట్ కోసం చిన్న ఈవీ కార్లను తీసుకొస్తామని తెలిపారు. అయితే, ప్రీమియం, లగ్జరీ కార్ల విభాగంలోనూ అవకాశాలను వదులుకోమని స్పష్టం చేశారు.



# కేవలం డాలర్‌తో పోలిస్తేనే రూపాయిల విలువ బలహీనం


ఇటీవల భారత కరెన్సీ రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో పతనమైంది. తొలిసారిగా డాలర్‌తో రూపాయి రూ. 88 మార్కు దాటిన తర్వాత మరింత కనిష్టానికి విలువ క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారత కరెన్సీ రూపాయి విలువ పతనంపై స్పందించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మాత్రమే కాదు, ఇతర దేశాల కరెన్సీలు కూడా బలహీనంగా ఉన్నాయని చెప్పారు. అయితే, డాలర్‌తో పోల్చినప్పడే రూపాయి మారకం ఎక్కువ బలహీనపడిరది. ఇతర కరెన్సీలతో చూస్తే బలంగా ఉంది. ఇది కూడా డాలర్ బలపడేందుకు మరో కారణం. ఇతర కరెన్సీలతో పోల్చినప్పుడు భారత రూపాయి ఈ స్థాయిలో ప్రభావితం కాలేదని ఆమె స్పష్టం చేశారు. అందుకే కరెన్సీ మారకంపై ప్రత్యేక దృష్టి సారించామని ఆర్థిక మంత్రి వివరించారు. ప్రభుత్వం రూపాయి మారకపు రేటును నిశితంగా గమనిస్తోంది. ఇదివరకు అంతర్జాతీయ పరిణామాలు రూపాయి బలహీనతను ప్రభావితం చేయగా, ఇటీవల దేశీయ పరిణామాల వల్ల కూడా మారకం రేటు హెచ్చుతగ్గులకు కారణమవుతోందన్నారు. కాగా, శుక్రవారం ఇంట్రాడేలో భారత రూపాయి రూ. 88.38 వద్ద చారిత్రాత్మక కనిష్టానికి పడిపోయింది. అమెరికా సుంకాల ప్రభావం కారణంగానే ఈ స్థాయి పతనం నమోదైంది. ఇందుకు ప్రధానంగా భారత వస్తువులపై అమెరికా అధిక సుంకాలను విధించడం, ఫలితంగా ఎగుమతులపై ప్రతికూల ప్రభావం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున మన మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకెళ్లడం వంటి పరిణామాలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) జోక్యం చేసుకుని నష్టాలను పరిమితం చేయగలిగింది.

# జీఎస్టీ రేట్ల కోత.... సెప్టెంబర్ 22లోగా చేయాల్సిందే




వస్తు, సేవల పన్ను జీఎస్టీలో చేపట్టిన సంస్కరణలను ప్రజల సంస్కరణగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో దేశంలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. వినియోగం పెరుగుతుందని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అయితే, జీఎస్టీ రేట్లను తగ్గించినప్పటికీ అది ప్రజలకు చేరవేయడంలో కంపెనీలు, హోటళ్లు, దుకాణదారులు జాప్యం చేయవచ్చన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఈ అంశంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని ప్రజలకు చేరవేసేందుకు తానే వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. నేరుగా తానే రంగంలోకి దిగి ఈ విషయాన్ని పర్యవేక్షిస్తూ ఉంటానని, కచ్చితంగా ప్రజలకు అందేలా చూస్తామన్నారు. పరిశ్రమ సైతం ఇప్పటికే జీఎస్టీ రేట్ల కోతలపై సానుకూలతలు చూపించినట్లు చెప్పారు నిర్మలా సీతారామన్. ఈ నిర్ణయం తీసుకున్న కొద్ది రోజుల్లోనే కార్ల తయారీ సంస్థల నుంచి బీమా కంపెనీలు, షూ, దుస్తుల బ్రాండ్లు ధరల తగ్గింపును ప్రకటించాయని పేర్కొన్నారు. కొత్త జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చే సెప్టెంబర్ 22వ తేదీ నాటికి మిగిలిన సంస్థలూ దీనిని అనుసరించే అవకాశాలు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 22 నుంచి కచ్చితంగా తగ్గించిన రేట్లను అమలు చేయాల్సిందేనన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం నాటి నుంచే జీఎస్టీ కొత్త రేట్లు అమలులోకి వస్తాయని, అప్పటి నుంచి సబ్బుల నుంచి కార్ల వరకు, ఎయిర్ కండిషనర్ల నుంచి షాంపులు, ట్రాక్టర్ల వరకు మొత్తం 400 ఉత్పత్తుల వరకు ధరలు దిగివస్తాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్య జీవిత బీమా ప్రీమియం పన్ను రహితంగా మారుతుందన్నారు. రూపాయి కూడా జీఎస్టీ కట్టాల్సిన అవసరం రాదని, దీంతో ప్రీమియం దిగువస్తుందని చెప్పారు. అయితే, హానికర ఉత్పత్తులు, అల్ట్రా లగ్జరీ వస్తువులపై కొత్త శ్లాబూ 40 శాతం ప్రకారం జీఎస్టీ అమలవుతుందన్నారు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తాజా జీఎస్టీ సంస్కరణలు 140 కోట్ల మంది ప్రజల జీవితాలను తాకుతాయన్నారు.

# పండగ షాపింగ్‌కు రెడీ అవుతున్నారా..?



మన దేశంలో పండగల సీజన్ మొదలైపోయింది. మరో 15 రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత దీపావళి మొదలు కొని సంక్రాంతి వరకు ఏదో ఒక పండగ వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా దసరా, దీపావళి పెద్ద పండగలు. యావత్ భారతావని ఈ రెండు పండగలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. పండగ అంటే కొత్త బట్టలు ఉండాల్సిందే. ఇక పూజా సామగ్రి, గృహోపకరణాలు, బంగారం, వెండి ఆభరణాలు కొంటుంటారు. మరి ఈ లాంగ్ పండగ సీజన్‌లో షాపింగ్ చేసేందుకు మీరు సిద్ధమవుతున్నారా? పండగలు, ప్రత్యేక సందర్భాలు ఎప్పుడు వస్తున్నాయి, ఎప్పుడు ఏది కొనాలి, ఎక్కడ ఎలా కొనాలి, ఎంత బడ్జెట్లో కొనుగోలు చేయాలి? అనే వివరాలతో ఒక లిస్ట్ రాసి పెట్టుకోవాలి. దుస్తుల బడ్జెట్‌తో పాటు పండగకు అయ్యే ఖర్చును ఆ లిస్టులో చేర్చాలి. అందులోనే మీ రాబడి ఎంత, ఖర్చు ఎంత అవుతుందని రాసుకోవాలి. రెండిరటి లెక్క చూసుకుని ఖర్చు చేయాలి. కొనుగోలు చేయాలనుకుంటున్న వాటిలో అతి ముఖ్యమైనవి ఏవి, ముఖ్యమైనవి ఏవి, అంతగా ప్రాధాన్యం లేనివి అవి లేకున్నా పని జరుగుతుందనే వాటిని విభజించుకుని ఓ లిస్ట్ తయారు చేసుకోవాలి. దీంతో వృథా ఖర్చు తగ్గించుకోవచ్చు. కొనుగోలు చేసే ముందు ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఉన్న ధరలను చెక్ చేయాలి. ఆ తర్వాత దుకాణాల్లో ధరలను పోల్చి చూసుకోవాలి. ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ తీసుకుంటే సరిపోతుంది. అయితే, నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. ఇంట్లో తరుచుగా ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేయాలనుకుంటే మాత్రం ఒక్కోటి కాకుండా బల్క్‌లో తీసుకోవడం మంచిది. ఒకేసారి ఎక్కువ కొంటే ఆఫర్లు ఉంటాయి. తక్కువ ధరకే లభిస్తాయి. పండగల సమయంలో డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులపై బ్యాంకులు రివార్డులు, క్యాష్ బ్యాక్స్ ఇస్తాయి. ఆన్‌లైన్‌లో ఏ కార్డుల ద్వారా ఏ ఆఫర్ వస్తుందో చెక్ చేసుకోవాలి. అవసరానికి తగినంత డబ్బు చేతిలో లేకపోతే తర్వాత కట్టచ్చులే అని క్రెడిట్ కార్డును ఇష్టమచ్చినట్లు వాడేయకూడదు. ఇచ్చిన సమయంలోపు తిరిగి చెల్లించలేకపోతే వడ్డీ ఎక్కువ కట్టాల్సి వస్తుంది. క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు. పండగల సీజన్‌లో ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు సైతం వల వేస్తుంటారు. మొబైల్ ఫోన్‌కు, ఇ-మెయిల్స్‌కు ఆఫర్లు ఇస్తున్నామని లింకులు పంపిస్తుంటారు. అలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ఆఫర్ వస్తుంది కదా అని లింకులు తెరిస్తే మీ ఫోన్ హ్యాక్ అవుతుంది. మీ బ్యాంక్ ఖాతాల్లో ఉండే డబ్బు మొత్తం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అయితే, పండగ షాపింగ్ ఎంత జాగ్రత్తగా చేస్తారో అంతకన్నా ఎక్కువగా ఆఫర్ల విషయంలో జాగ్రత్త పడాలి. తక్కువ ధరకే ఇస్తున్నారని ఆశపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# నరకం అంటూనే టికెట్లు కొంటున్నారు



ఇటీవలే విడుదలైన బాలీవుడ్ మూవీ భాగీ 4కి యునానిమస్ గా నెగటివ్ టాక్, రివ్యూలు వచ్చేశాయి. మితిమీరిన హింస, తలాతోకా లేని కథా కథనాలతో థియేటర్లో కూర్చుకున్న ప్రేక్షకులతో నరకం స్పెల్లింగ్ రాయించిందనే కామెంట్ చాలా చిన్నదని చెప్పాలి. హీరో టైగర్ ష్రాఫ్ రెండున్నర గంటల పాటు దైవాంశ సంభూతుడిలా వేల కొద్ది బుల్లెట్లు, వందల కత్తిపోట్లు తగిలించుకునా నిటారుగా నిలబడి ఫైట్లు చేసిన వైనం మంచి ట్రోలింగ్ మెటీరియల్. సంజయ్ దత్ ఈ మూవీలో నరికిన చేతులు, తలలు లెక్కబెట్టాలంటే ఒక అయిదారుగురు లెక్కల టీచర్లకు డబ్బులిచ్చి మరీ కూర్చోబెట్టాలి. అయినా వాళ్ళు కరెక్ట్ గా చెప్పలేరు. ఇంత తేడా కంటెంట్ ఉన్న భాగీ 4 ఈ ఫ్రాంచైజ్ కి మాస్ లో ఉన్న ఫాలోయింగ్ వల్ల వీకెండ్ వరకు బాగానే వసూళ్లు రాబట్టింది. ట్రేడ్ లెక్కల ప్రకారం ఆదివారం రాకముందే ఇరవై నాలుగు కోట్లకు పైగా వసూలు చేయడం విచిత్రమే. అలాని జనాలు దీని గురించి పాజిటివ్ గా చెప్పడం లేదు. సోషల్ మీడియా వేదికగా తలంటుతూనే ఉన్నారు. దీంతో పాటే విడుదలైన ది బెంగాల్ ఫైల్స్ లో వివాదాస్పద అంశాలు, తెలుసుకోవాల్సిన సత్యాలు చాలా ఉన్నా ఆడియన్స్ దానికి దూరంగా ఉన్నారు. స్టార్లు లేకుండా మరీ మూడున్నర గంటల పాటు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి చెప్పిన కథ డాక్యుమెంటరీ ఫీలింగ్ ఇచ్చింది. క్రిటిక్స్ ని ది బెంగాల్ ఫైల్స్ మెప్పించినప్పటికీ కమర్షియల్ గా మాత్రం డిజాస్టర్ వైపు వెళ్తోంది. దానికి భాగీ 4 కారణం కాదు కానీ నిడివి పెద్ద దెబ్బ కొట్టింది. అన్నట్టు భాగీ సిరీస్ లో ఇప్పటిదాకా వచ్చినవన్నీ రీమేకులే కావడం గమనార్హం. భాగీకి పునాది పడిరది ప్రభాస్ వర్షంతో. భాగీ 2 కోసం అడవి శేష్ క్షణంని తీసుకున్నారు. భాగీ 3కి నాగచైతన్య తడాకా ఉపయోగపడిరది. ఇప్పుడు భాగీ 4కి తమిళ మూవీ ఐయితు ఐయుతు ఐయుతుతో పాటు గోపీచంద్ ఒంటరి, బాలకృష్ణ లయన్ ని వాడుకున్నారు. అయినా ఉత్తరాది ప్రేక్షకులు మహా వెరైటీ. కొన్నిసార్లు తేడాగా ఉన్న డిజాస్టర్లకు కూడా కాసులు కురిపించేస్తారు.



# మళ్లీ అదే స్టోరీ... ఇక్కడ ఫ్లాప్ అక్కడ హిట్

ఒకప్పుడు తమిళ సినిమాల క్వాలిటీనే వేరుగా ఉండేది. మార్కెట్ పరంగా రేంజ్ తక్కువ కావచ్చు కానీ.. కంటెంట్ క్వాలిటీ మాత్రం ఇండియాలో ఏ ఇండస్ట్రీకి తీసిపోని స్థాయిలో అక్కడి సినిమాలుండేవి. అక్కడ అనేక ప్రయోగాలు జరిగేవి. కమర్షియల్ సినిమాల్లోనూ వైవిధ్యం చూపించేవాళ్లు. రొటీన్ సినిమాలను పెద్దగా పట్టించుకునే వాళ్లు కాదు. కానీ గత దశాబ్ద కాలంలో మొత్తం మారిపోయింది. తమిళ సినిమాల క్వాలిటీ బాగా పడిపోయింది. ఒకప్పుడు అద్భుతమైన సినిమాలు అందించిన శంకర్, మణిరత్నం, మురుగదాస్ లాంటి దర్శకుల నుంచి పేలవమైన సినిమాలు వస్తున్నాయి.మురుగదాస్ సంగతే తీసుకుంటే.. 'స్పైడర్' దగ్గర్నుంచి ఆయన వరుసగా డిజాస్టర్లు డెలివర్ చేస్తున్నాడు. ఈ ఏడాది బాలీవుడ్లో ఆల్రెడీ 'సికందర్' సినిమాతో షాక్ తిన్నాడు మురుగదాస్. తమిళంలో తీసిన 'మదరాసి'తో ఆయన పుంజుకుంటాడేమో అని అభిమానులు ఆశించారు. ఐతే ఈ సినిమాకు కూడా డివైడ్ టాక్ తప్పలేదు. మురుగదాస్ గత చిత్రాలతో పోలిస్తే కొంచెం బెటర్ అనే టాక్ వచ్చింది తప్ప.. ఓవరాల్‌గా ఇది మెప్పించే సినిమా అయితే కాదు. విపరీతమైన సాగతీత.. యాక్షన్ ఎపిసోడ్లు తప్ప విషయం లేని బోరింగ్ సెకండాఫ్ సినిమాకు పెద్ద మైనస్ అయింది. తెలుగులో ఈ సినిమాకు ఆరంభం నుంచి ఆశించిన వసూళ్లు లేవు. రెండో రోజు సినిమా మరింత వీక్ అయింది. ఇక్కడ 'మదరాసి' ఫ్లాప్ అని తేలిపోయింది. కానీ తమిళంలో మాత్రం 'మదరాసి' వీకెండ్లో బాగా ఆడుతోంది. శుక్ర, శనివారాల్లో ఈ చిత్రం తమిళంలో మంచి ఆక్యుపెన్సీలతో నడిచింది. ఆదివారం కూడా చెన్నై సహా మేజర్ సిటీస్‌లో 'మదరాసి' స్ట్రాంగ్‌గానే కనిపిస్తోంది.



# త్రిష ఆసక్తికర కామెంట్స్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష 'విశ్వంభర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెగాస్టార్, వశిష్ట కాంబోలో రాబోతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సోసియోఫాంటసీ కథతో రాబోతున్న ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా విడుదల కాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025 వేడుకలకు త్రిష హాజరైంది. దుబాయ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో.. 2024 సంవత్సరంలో తమ సత్తా సాటిన నటీనటులు, మూవీ యూనిట్స్‌కు ఈ అవార్డులు ప్రకటించారు. ఇక ఇందులో అవార్డు సొంతం చేసుకున్న త్రిష మాట్లాడుతూ.. ''2012 నుంచి నేను సైమాకు హాజరవుతున్నాను. ఇది నిజంగా చాలా అభివృద్ధి చెందింది. మాకు ఇంట్లో ఉన్నట్లు అనిపించేలా చేస్తారు. నాలుగు పరిశ్రమలకు సంబంధించిన సెలబ్రిటీలు కలుసుకునే సైమా వేడుకలు అంటే నాకు చాలా ఇష్టం. తరచుగా తమిళ అవార్డులు ఇస్తారు.. కానీ సైమా అవార్డ్సులోనే ప్రతి ఒక్కరినీ చూడొచ్చు. ఇది చాలా ప్రత్యేకమైనది.. ఎప్పటికీ మర్చిపోలేని క్షణాలు మాకు అందిస్తుంది. నా ప్రయాణంలో భాగమైన నా దర్శకులు, నిర్మాతలు, నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. నేను చేసిన కొన్ని చిత్రాల గురించి నేను చాలా గర్వపడుతున్నాను. కొన్ని సినిమాలు గొప్ప పాఠాలు నేర్పించాయి. నేను నిజమైన ప్రేమను పొందాను. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నుంచి ఇంకా బాగా నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఎల్లప్పుడూ నా వెనకాలే ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్నందుకు నా ప్రియమైన శ్రేయోభిలాషులు, అభిమానులు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

# 9 సంవత్సరాల నాటి క్రిష్ కావాలి



దర్శకుడు క్రిష్ అంటే మూవీ లవర్స్ లో ప్రత్యేక గౌరవముంది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములా జోలికి వెళ్లకుండా విభిన్నమైన కథలతో ఆలోచింపజేసే సినిమాలు తీస్తాడని ఎక్కువగా ఇష్టపడతారు. గమ్యం, వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ కు ఇప్పటికీ బోలెడు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. తన ముద్ర 2015లో వచ్చిన కంచెతోనూ కొనసాగింది. 2017లో గౌతమిపుత్రశాతకర్ణితో బాలకృష్ణకు మర్చిపోలేని వందో మూవీ ఇచ్చిన క్రిష్ ఆ తర్వాత ట్రాక్ తప్పారు. మణికర్ణిక నుంచి మధ్యలోనే బయటికి వచ్చేయడంతో కంగనా రౌనత్ తో పాటు డైరెక్షన్ కార్డుని పంచుకోవాల్సి వచ్చింది. అది యావరేజ్ కావడం వేరే విషయం. బాలయ్య ఫ్యాన్స్ ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎన్టీఆర్ కథానాయకుడు, మహానాయకుడు రెండూ తీవ్రంగా నిరాశపరిచాయి. స్వర్గీయ ఎన్టీఆర్ గా బాలకృష్ణ నటన ఎంత అద్భుతంగా ఉన్నా మహానటి టైపు ట్రీట్ మెంట్ రాసుకున్న క్రిష్ ఆ స్థాయిలో మెప్పించలేకపోయారు. కొండపొలం సంగతి సరేసరి. చదవడానికి గొప్పగా అనిపించే నవలను తెరకెక్కించే క్రమంలో పడిన తడబాటుతో పాటు ఇంత హెవీ సబ్జెక్టుకి వైష్ణవ్ తేజ్ ని హీరోగా పెట్టడం ఆడియన్స్ తిరస్కారానికి కారణమయ్యింది. ఇక హరిహర వీరమల్లు గురించి తెలిసిందే. డిజాస్టర్ లో జ్యోతికృష్ణదే సింహ భాగమైనా క్రిష్ ప్రమేయాన్ని కొట్టి పారేయలేం. ఇప్పుడు ఘాటీ కూడా వీటి కోవలోకే చేరింది. తన సెన్సిబిలిటీకి ఏ మాత్రం సూటవ్వని గంజాయి స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ ని తీసుకున్న క్రిష్ దాన్ని కనీసం యావరేజ్ అనిపించే స్థాయిలో తీయలేకపోయారు. అనుష్క విశ్వరూపం చూస్తారని పదే పదే చెప్పుకుంటూ వచ్చారు కానీ తన దర్శకత్వపు విశ్వరూపం కోసం ఎదురు చూసే ప్రేక్షకులు ఉన్నారని మర్చిపోయారు.



# కోలీవుడ్‌లో బంపర్ ఆఫర్ అందుకున్న శ్రీదేవి

యంగ్ హీరోయిన్ శ్రీదేవి అప్పల 'కోర్టు' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఇందులో నటించిన శ్రీదేవికి ఫుల్ పాపులారిటీ వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. కేజీఆర్‌కు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, శ్రీదేవికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆసక్తిని పెంచుతోంది. ఈ భామ కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కెన్ కరుణాస్ హీరోగా నటిస్తున్న సినిమాలో శ్రీదేవి హీరోయిన్‌గా చేస్తున్నట్లు టాక్. స్కూల్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అనిష్మా, ప్రియాంశి యాదవ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలో నటిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'కాదలన్' టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. శ్రీదేవి బంపర్ ఆఫర్ అందుకుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in